క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం పునర్వసు నక్షత్రం త్రయోదశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

మద్యం షాపుల డ్రా తేదీ వాయిదా

పర్చూరు(చినగంజాం): మండలంలో గౌడ కులస్తులకు కేటాయించిన మద్యం షాపులకు సంబంధించి సోమవారం బాపట్ల కలక్టరేట్‌లో నిర్వహించాల్సిన డ్రాను వాయిదా వేసినట్లు పర్చూరు ఎక్సైజ్ సీఐ భుజంగరావు తెలిపారు. డ్రా నిర్వహించే తేదీని మళ్లీ ప్రకటిస్తామన్నారు.

చీరాల: గీతకులాల మద్యం షాపులకు జరగాల్సిన లాటరీ ప్రక్రియను వాయిదా వేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు సంబంధించిన లాటరీ ప్రక్రియ సోమవారం జరగాల్సి ఉండగా ప్రస్తుతం వాయిదా వేసినట్లు తెలిపారు.

అంబడిపూడిలో నేడు లేగదూడల ప్రదర్శన

బల్లికురవ: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం7 గంటలకు మండలంలోని అంబడిపూడి పశువైద్యశాలలో లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి ఆర్.పావని కుమారి ఆదివారం తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ మేలుజాతి లేగదూడల ప్రదర్శనకు రైతు సోదరులంతా వినియోగించుకోవాలని కోరారు.

గుంజి వెంకటరావుకు ఘన నివాళి

అద్దంకి రూరల్: సీపీఎం నాయకుడు గుంజి వెంకటరావుకు ఆ పార్టీ నాయకులు ఘననివాళి అర్పించారు. ఇటీవల ఆయన మరణించగా ఆదివారం స్థానిక పోతురాజుగంటి వద్ద సంతాప సభ నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, రిమ్స్ డాక్టర్ సుధాకరబాబు నివాళులర్పించారు. మరణానంతరం రిమ్స్‌కు అవయవ దానం చేసిన వెంకటరావు ఆశయాలు నేటి తరానికి ఆదర్శమన్నారు.

సిమెంట్ బల్లల వితరణ



నాగులపాలెంలో సిమెంట్ బల్లలు బహూకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు(చినగంజాం): బాపట్ల రోటరీ క్లబ్ సభ్యులు కొల్లా శ్రీనివాసరావు మండలంలోని నాగులపాలెం గ్రామానికి 12 సిమెంట్ బల్లలు ఆదివారం బహూకరించారు. తన తండ్రి రామయ్య జ్ఞాపకార్థం గ్రామస్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు, గ్రామ ప్రజలు విశ్రాంతి తీసుకునే విధంగా సిమెంచ్ బల్లలు అందజేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, రావి సత్యనారాయణ, కోట హరిప్రసాదరావు, పాబోలు వెంకన్న, నాగబైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, పోలిశెట్టి చంద్రం, కొల్లా శివరామకృష్ణ ప్రసాద్, కొల్లా నరేంద్ర,రావి సతీష్ బాబు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీ రూల్స్ పాటించాలి

మద్దిపాడు: వ్యతిరేక దిశలో ప్రయాణం చేయడం, వాహనాలను నడపటం ద్వారా ప్రమాదాలు కొనితెచ్చుకునే పరిస్థితి ఉంటుందని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని సీతారాంపురం కొష్టాలు సెంటర్, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి, రాచవారిపాలెం జంక్షన్, గ్రోత్ సెంటర్ వద్ద వ్యతిరేక దిశలో వాహనాలు నడపటం వలన రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్న క్రమంలో స్థానిక ఎస్సై బి.శివరామయ్య తమ సిబ్బందితో పాటు ప్రధాన కూడలి వద్ద వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తూ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం వెల్లంపల్లి తాళ్లూరు రోడ్ లోని జీఎంఆర్ సినిమా హాలును పరిశీలించారు.

మురుగుకు లేదా విరుగుడు?



తూర్పు కొప్పెరపాడులో డంపింగ్ యార్డు



జనకవరం గ్రామంలో డంపింగ్ యార్డు ఇలా..

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా..
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారం
- పల్లెల పరిశుభ్రత గురించి పట్టించుకోని అధికారులు



అలవలపాడులో డ్రైనేజ్ లేక నిలిచిన మురుగు నీరు

జె.పంగులూరు:

గ్రామీణ ప్రాంతాలు అపరిశుభ్రతకు ఆవాసాలుగా మారాయి. చెత్త నుంచి రక్షణ కల్పించే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని 21 గ్రామాల్లో ఏర్పాటు చేయగా 80 శాతానికి పైగా మూలన పడ్డాయి. పల్లె, పరిశుభ్రత, స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా నినాదంతో స్వచ్ఛ హీ సేవ కాక్రమాలు ఎంతో ఆర్భాటంగా జరిగాయి. అయితే ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. మురుగు నీరు ముందుకు కదలడం లేదు. లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించకపోవటం పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కింది.

మండలంలో ఇలా..

మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు, జనకవరం, తూర్పు తక్కెళ్ళపాడు, రేణింగివరం ఇలాంటి చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం అవి అసాంఘిక కార్యకలాపాలకు అవాసాలుగా, మందుబాబులకు నిలయాలుగా మారాయి. మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు, జనకవరం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో మండల స్థాయి అధికారులు, తెలుగు దేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుద్ధ్య నిర్వహణపై మెరుగైన చర్యలు చెపట్టలేదు. కొద్ది నెలలుగా కొద్దీ గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇచ్చిన దాఖలాలు లేవు. పంచాయతీ రిక్షాలకు మరమ్మతులు చేయడంలేదు. కొన్ని గ్రామాల్లో చెత్త రిక్షాలను పాత ఇనుము దుకాణాలకు అమ్మిన దాఖాలున్నాయి. అలవలపాడు పంచాయతీ పరిధిలోని చెత్త రిక్షాలు అలాంటి దుకాణాల్లో దర్శనమిస్తున్నాయి. అధికారులు తూతూ మంత్రంగా పర్యటించి, డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలపై ప్రజలకు తెలియజేసి, ఫొటోలకు పోజులిచ్చి కార్యక్రమాలను ముగించారు.

ఎటు చూసినా అపరిశుభ్రతే

ఎక్కడ చూసినా అపరిశుభ్రత కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టిపెట్టలేదు. గ్రామాల్లో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయెగంలోకి తీసుకురావాలి.

– ముళ్ళూరి వెంకటేశ్వర్లు (చందలూరు)

రోడ్లపైనే మురునీరు

గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. డ్రైనేజ్‌లు అస్తవ్యస్తంగా మారాయి. కాలువలు పూడిక నిండి మురగు కదలడం లేదు. గ్రీన్ అంబాసిడర్‌లు జీతాలు లేక, చెత్త రిక్షాలు తుప్పు పట్టి, కొన్ని పంచాయతీల్లో రిక్షాలను పాత ఇనుము సామాగ్రి కొట్టువాళ్ళకు అమ్మిన దాఖలాలున్నాయి.

– వానపల్లి సుబ్బారెడ్డి (కొండమూరు)

విద్యుత్ సరఫరా సమయాల్లో మార్పు

బల్లికురవ: మండలంలోని వి.కొప్పరపాడు వెలమవారిపాలెం 33/11కెవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం నుంచి వ్యవసాయానికిచ్చే విద్యుత్ సరఫరలో సాంకేతిక మరమ్మతుల దృష్ట్యా వేళల్లో మార్పులు చేసినట్లు ఏఈ పి. శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఇప్పటివరకు ఉదయం 7 గంటల నుంచి నిరంతరంగా 9 గంటలపాటు సరఫరా ఇచ్చామని ఇక నుంచి తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు.. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు దఫాల్లో సరఫారా చేస్తామన్నారు. సింగిల్ ఫేజ్‌లో ఎలాంటి మార్పులు లేవని రైతులు సహకరించాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

పర్చూరు(చినగంజాం): పర్చూరు నేతాజీ వృద్ధాశ్రమంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులకు ఆదివారం దాతలు అన్నదానం చేశారు. దొప్పలపూడి శేషుబాబు, రామాంజమ్మ కుమారుడు ప్రసన్నభాను పుట్టినరోజు పురస్కరించుకొని అన్నదానం చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. నాగబైరు శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠ వేడుకలు

బల్లికురవ: మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో సీతారామలక్ష్మణ హనుమత్ సమేత జీవధ్వజ శిఖరం యంత్రప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం రెండోరోజు వైభవంగా నిర్వహించారు. యాగశాలలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కలశ పూజలు, హోమాలు చేపట్టారు. విగ్రహాల గ్రామోత్సవానికి ముందు భాగంలో కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సోమవారం ఉదయం 8.47 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవాలు, మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి అన్నసంతర్పణ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



గ్రామోత్సవంలో వార్లు పోస్తున్న మహిళలు



యాగశాలలో పూజలు



గ్రామోత్సవంలో స్వామివారు

ఆలయ కమిటీ ఎంపిక ఏకగ్రీవం

మార్టూరు: మార్టూరులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీని ఆదివారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి మామిడిపాక హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షునిగా మద్దు సీతారామయ్య (నాని), కార్యదర్శిగా కనుమర్ల పూడి నవీన్, కోశాధికారిగా మోదడుగు మురళి తదితర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన కమిటీ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ఆర్యవైశ్య నాయకులు సాతులూరి మోహన్రావు, ధర్మకర్త పొత్తూరి సుబ్బారావు, శ్రీరామ్ శేషగిరిరావు, చిన్ని నాగేశ్వరరావు చేబ్రోలు నారాయణమూర్తి, అరవపల్లి నాగేశ్వరరావు, పర్చూరు మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షురాలు ఊటుకూరి నిర్మలా దేవి, గుర్రం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న నూతన కమిటీ సభ్యులు, నాయకులు

గంగమ్మతల్లికి పొంగళ్లు



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్ళు నైవేద్యం సమర్పించారు. ఆదివారం వేకువ జామునుంచే ఆడపడుచులు తలంటు స్నానాలు ఆచరించి అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు పుష్కలంగా పండి మంచి దిగుబడులు రావాలని, పండిన పంటలకు మంచి గిట్టుబాటు ధర రావాలని సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి కలగాలని పూజలు చేశారు.

అనంతరం ఆలయం ప్రాంగణంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ చిన్నారులకు మంచి విద్యాబుద్ధులు ప్రసాదించాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రాజేష్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మిరపకాయల అపహరణ

అద్దంకి రూరల్: ఇంటి వద్ద నున్న ఖాళీ స్థలంలో ఎండబెట్టిన మిరపకాయలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన సంఘటన రాళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఆదివారం ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు. రాళ్లపల్లి గ్రామానికి చెందిన రైతు వడ్డీసీడు శ్రీను తాళ్లూరు మండలం మల్కాపురంలో 1.5 ఎకరం భూమిని కౌలుకు తీసుకుని అందులో మిరప పంట వేశాడు. 10 టన్నుల మిపరకాయలను రాళ్లపల్లి గ్రామంలో తన ఇంటికి ఈనెల 7న తీసుకుని వచ్చి ఖాళీస్థలంలో పట్టకప్పి వచ్చాడు. తెల్లవారి వెళ్లి చూసేసరికి మిరపకాయలు లేకపోవటంతో ఫిర్యాదు చేశాడు.

కాటాలో తేడా ఉంటే చర్యలు



ధాన్యం కాటాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు



మాంసం విక్రయ షాపులో కాటా పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

వేటపాలెం: వ్యాపార సంస్థలు, చిల్లర దకాణాల్లో తూకాలు, కాటాల్లో తేడాలుంటే చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట, వేటపాలెం, పందిళ్లపల్లి గ్రామాల్లో పలు దుకాణాను తూనికల కొలతల అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంట పొలాల వద్ద రైతుల ధాన్యం కొనుగోలు చేస్తున్న బ్రోకర్లు కాటాల్లో కిలో మేర తేడా గుర్తించినట్లు తెలిపారు. మాంసం విక్రయ షాపుల్లో, చేపలు విక్రయాల షాపుల్లో కాటాల్లో తేడాలు గుర్తించినట్లు చెప్పారు. తూనికలు, కాటాల్లో తేడాలు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని వినియోగదారులు సూచించారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోండి



సంతమాగులూరు (అద్దంకి రూరల్): పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. 17 మంది విద్యార్థులతో చదివించారు.

డాక్టర్ ప్రసన్నకుమార్‌కు ఘన సన్మానం

పర్చూరు (చినగంజాం): నూతలపాడు తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ బండారు జాకబ్ ప్రసన్నకుమార్‌ను సంఘం పెద్దలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన గత 20 ఏళ్ల నుంచి సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తుగా అమెరికన్ బాప్టిస్టు ఫారిన్ మిషన్ సొసైటీ ఇటీవల అతనికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నూతలపాడు చర్చిలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి శాలువా, పూలమాలతో సత్కరించారు. సంఘ పెద్దలు తమ్మిలూరి సింగయ్య, ఆనందరావు, ఏసు రత్తయ్య, తిమోతి, తమ్మిలూరి కోటేశ్వరరావు, శ్యాంబాబు, రత్నకుమార్, రూబేను తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్నకుమార్‌ను సన్మానిస్తున్న సంఘ పెద్దలు

పేరాల రైల్వే గేటు మూసివేత

చీరాల రూరల్: మరమ్మతుల నిమిత్తం స్థానిక పేరాల జాన్‌పేట వద్దగల కారంచేడు రైల్వేగేటును అధికారులు ఆదివారం తాత్కాలికంగా మూసివేశారు. పట్టాల మరమ్మతులు, ట్రాక్ మధ్య తారువేసి రోడ్డు పనులు చేపడుతున్న దృష్ట్యా గేటును తాత్కాలికంగా మూసివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో కారంచేడు నుంచి చీరాలవైపు వచ్చే వాహనాలు, చీరాల నుంచి కారంచేడు వైపు వెళ్లే వాహనాలు గేటుకు రెండువైపులా బారులుతీరి నిలిచిపోయాయి. జీఆర్పీ పోలీసులు, స్థానిక పోలీసులు రంగ ప్రవేశంచేసి పేరాల నుంచి రైల్వే గేటు దాటి కారంచేడువైపు వెళ్లే వాహనాలను రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా కారంచేడు వైపునకు ట్రాఫిక్ మళ్లించారు.



ట్రాక్ మధ్యలో పనులు చేస్తున్న రైల్వే కార్మికులు

మత్స్యకారులకు వలల పంపిణీ



మత్స్యకారులకు వలలు అందిస్తున్న నాయకులు

చీరాల: మండలంలోని బేరిపురం యానాది కాలనీలో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు కాకుమాను సుబ్బారావు ఆధ్వర్యంలో మత్స్యకారులకు చేపలు పట్టే వలలు, మహిళలకు చీరలు, పిల్లలకు టీ షర్టులు, పెద్దలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నాయకులు బండారుపల్లి హేమంత్‌కుమార్, బాపట్ల పార్లమెంట్ కన్వీనర్ మువ్వల వెంకటరమణారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, టౌన్ అధ్యక్షురాలు జి.భవాని, మేడికొండ భరణీరావు, చీరాల మండల అధ్యక్షుడు బక్క మనోహర్‌రెడ్డి, పి.రమేష్‌బాబు, ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయంపై హర్షం

పర్చూరు(చినగంజాం): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బొమ్మల సెంటర్‌లో ఆదివారం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. షేక్ అమీన్ బాషా, అడపాల కృష్ణ, నటరాజ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో గుండ్లకమ్మ

నాగులుప్పలపాడు: గుండ్లకమ్మ నది వందల కిలోమీటర్ల మేర జిల్లాలో ప్రవహిస్తూ వేల మంది రైతులు, ప్రజలకు నీటి అవసరాలు తీరుస్తోంది. కాలక్రమంలో ఈ నది ఆక్రమణలకు గురై అస్తిత్వం కోల్పోతోంది. నాగులుప్పలపాడు మండల ప్రజలకు జీవధారగా ఉన్న గుండ్లకమ్మ నది మండలంలో 18 కి.మీ మేర ప్రవహిస్తోంది. దీనికింద 9 గ్రామాల ప్రజలకు తాగునీటి కోసం ప్రత్యక్షంగా మరో 12 గ్రామాలు పరోక్షంగా ఆధారపడుతుంటారు. అంతేకాక ఈ నదిపై ఆధారపడి 1500 ఎకరాల్లో మాగాణి, మరో 4 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగవుతుంటాయి. అయితే ఈ నదిలో చిల్లచెట్లు పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీనికి తోడు నదీ పరివాహక ప్రాంతంలో రానురాను ఆక్రమణల పర్వం ఎక్కువైంది. ఇప్పటికే మండలంలోని నిడమానూరు, చదలవాడ, చీర్వానుప్పలపాడు, అమ్మనబ్రోలు, మద్దిరాలపాడు గ్రామాల పరివాహకంలో సుమారు 30 ఎకరాలకు పైగా ఆక్రమణలు జరిగాయి. నది పరివాహకంలో ఆక్రమణలు ఎక్కువవడంతో పాటు చిల్ల చెట్లు పెరగడం నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నది ఒడ్డు కోతకు గురవుతోంది. ఒడ్డున ఉన్న పొలాలు కూడా పాడైపోవడంతో ఆవేదన చెందుతున్నారు.



చిల్లచెట్లతో నిండిపోయిన గుండ్లకమ్మ నది